

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెద్దమ్మ తల్లికి హారతిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు

జనసంద్రంగా
పెద్దమ్మ తల్లి ఆలయం

బంజారాహిల్స్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి భక్తులతో జనసంద్రంగా మారింది. ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా సప్తశతి పారాయణం, స్థాపిక దేవతాహవనములు, రుద్రహోమం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, ఆలయ ఫౌండర్ విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు అమ్మవారికి హారతి ఇచ్చి పూజలు చేశారు. ఈ నెల 15న పూర్ణాహుతి, అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపట్టాలి

- తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా



హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.సాయిబాబ డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ఉద్యోగులకు పదోన్నతులు లేకుండా ఉన్నారని ఆయన అన్నారు. ఖైరతాబాద్ మింట్‌కాంపౌండ్ 1104 యూనియన్ ప్రధానకార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతామన్నారు. విద్యుత్‌సంస్థల్లో ఐదేళ్లుగా ప్రమోషన్ల అంశం పెండింగ్‌లో ఉన్నా, యాజమాన్యం పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్టిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ సలహాదారు ఆర్.జనార్దన్‌రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఎ.వేణు, ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు రఘునందన్, ఎస్.వెంకన్న, ఎం.భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణ, దుర్గాఆశోక్, రంగరావు, నాగార్జున పాల్గొన్నారు.



ఆర్థిక సాయం పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ట్రస్టు నిర్వాహకులు

పేద విద్యార్థుల చదువు కోసం
ఎంఎస్‌ఆర్ ట్రస్టు ఆర్థిక సాయం

ఖైరతాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సంపాదించిన దాంట్లో కొంత భాగం పేదల విద్య, వైద్యం కోసం ఖర్చుపెట్టడం ఎంతో తృప్తి మిగులుస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లో ఎంఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండో విడతగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం కింద ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున అందజేశారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదల విద్య, వైద్యం కోసం ప్రతీ సంవత్సరం కోటి రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకుడు శివారెడ్డిని.. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభినందించారు. ఇందులో ప్రముఖ వాస్తు, జ్యోతిష పండితులు డాక్టర్ జీవి వరప్రసాద్, ట్రస్టు ప్రతినిధి శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో కాంగ్రెస్ నాయకులు నవీన్‌యాదవ్ తదితరులు

జాతీయస్థాయి మల్లయోధుల పోటీకి 30 మంది అర్హత

బంజారాహిల్స్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మల్లయోధుల పోటీకి 30 మంది అర్హత సాధించారు. యూసుఫ్‌గూడ వల్లాల గ్రౌండ్‌లో అర్మేచర్ మల్లయోధుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 23 స్టేట్‌మెంట్, ఫ్రీస్టైల్, గ్రీకో పురుషులు, మహిళల మల్లయోధుల చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాల నుంచి 90 మంది మల్లయోధులు పోటీపడగా 30మంది బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ చైర్మన్ చిన్నశ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్ యాదవ్ విజేతలకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జాఫర్, ఉమేష్ ప్రవీణ్ కుమార్, ఎం.మల్లికార్జున్ యాదవ్, ఆదిత్య యాదవ్, అభిమన్యు యాదవ్, ఆంజనేయులు, యాదయ్య, సంతోష్ పైలవన్, పాండు, నర్సింగరావు, చందాకాంత్ కలిఫాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ మల్లు రవి పుట్టినరోజు సందర్భంగా గజమాలతో ఆయనను సత్కరిస్తున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామనోహర్, సెక్రటరీ జనరల్ మేడి రమేష్. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, రవిందర్, సోమ్లానాయక్, సీహెచ్.కృష్ణ, టీజీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ట్రాన్స్‌కో అధ్యక్షుడు శరబంద తదితరులు పాల్గొన్నారు.
- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

బస్సులో బంగారు ఆభరణాల చోరీ

ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్‌ఐఆర్... ఎల్బీనగర్‌కు బదిలీ

కొత్తపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బస్సు ప్రయాణికురాలు ఓయూ పీఎస్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును శనివారం ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఎల్బీనగర్ సిరీస్ రోడ్డులో వాస్తుకాలనీలో ఉండే గృహిణి ఎస్.పద్మలత(45) గురువారం మల్లాపూర్ సూర్యనగర్ కాలనీకి వెళ్లి రెండున్నర తులాల బంగారు ఆభరణాలను రీమోడల్‌చేయించుకుని ఆటోలో హబ్సిగూడకు వచ్చింది. అక్కడి నుంచి టీజీఆర్టీసీ 290 బస్సులో కామినేని చౌరస్తాకు చేరుకుని, బస్సు దిగి కొంతదూరం నడిచి, తర్వాత బ్యాగు చూసింది. ఆభరణాలు కనబడలేదు. శుక్రవారం ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బీఎన్ఎస్ ప్రకారం వారు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.



బంజారాహిల్స్ ఇందిరానగర్‌లో రోడ్డుపై తొలగించని చెత్త

- పట్టించుకోని అధికారులు
- నాలాల్లో తీసిన వ్యర్థాలు రోడ్లపైనే..
- తొలగించని పారిశుధ్య సిబ్బంది
- ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- బస్తీల్లో ప్రబలుతున్న డెంగీ, విషజ్వరాలు



ఛత్రపతి శివాజీనగర్‌లో వీధిలో రోడ్డుపైన పారుతున్న మురుగునీరు

ఇళ్ల మధ్య చెత్తకుప్పలు.. రోడ్లపై మురుగు...

ఖైరతాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం...వ్యాధులు ప్రబలే కాలం... ఓవైపు డెంగీ పంజా విసురుతుండగా, మరోవైపు విషజ్వరాలు, వాంతులు, విరోచనాలతో చిన్నారులు, వృద్ధులు సతమతమవుతున్నారు. ఎక్కడ చూసినా దోమలు, ఈగలు, ఇతర క్రిమికీటకాలు విజృంభిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో అంతటా అపరిశుభ్రం నెలకొంది. దాంతో డెంగీ, విష జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. ఇక్కడి జోనల్ కమిషనర్ 'డెంగీపై యుద్ధం' పేరిట పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో అవగాహన కల్పిస్తున్నా, సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపంతో దోమలు విజృంభిస్తోన్నాయి.

ఓపెన్ ప్రాంతాల్లోని చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడం ఇందుకు కారణం. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయ లోపంతో డ్రైనేజీలు, నాలాలు, కచ్చామోరీల నుంచి పూడికను తొలగించినా వాటిని ఎప్పటికప్పుడు తొలగించకపోడంతో దోమల వృద్ధికి కారకాలుగా మారుతున్నాయి. కాలనీలను, వీఏపీ ప్రాంతాల్లో పారిశుధ్యపనులు జరుగుతున్నా, బస్తీలు, పేదలు నివసించే ప్రాంతాల్లో మెడికల్ అధికారులు, ఎస్ఎఫ్ఎలు వారి విధులను సరిగ్గా నిర్వహించడంలేదు. డెంగీపై పోరాటానికి యువతను భాగస్వాములను చేస్తామంటున్న జీహెచ్ఎంసీ, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దాంతో బస్తీలు, కాలనీలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరు పారుతోంది. పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించక పోవడంతో ఇళ్ల మధ్య చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో దోమలు వృద్ధి ప్రజలు డెంగీ, విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి దోమలు వృద్ధి చెందకుండా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొట్లాడి హక్కులను సాధించుకోవాలి: ఎమ్మెల్యే వివేక్

పంజాగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో తెలుగు రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్‌రెడ్డి, దేశంలో నరేంద్రమోదీ అహంకారంపై దెబ్బకొట్టి గట్టి గుణపాఠం చెప్పారని చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమ్ సైనిక్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర గోసంగీ కులసంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పెద్దపల్లి ఎంపీ జి.వంశీకృష్ణ, ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామికి ఆత్మీయసన్మాన కార్యక్రమం జరిగింది. తొలుత వారు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ మోదీ తమకు నాలుగు వందల సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూశారని, కానీ దేశ ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేసీఆర్, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహంకారంపై దెబ్బ కొట్టారని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ వల్లనే తెలంగాణ వచ్చిందని అన్నారు. ఐకమత్యంగా ఉంటూ కొట్లాడి హక్కులు సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, సంఘం ప్రధానకార్యదర్శి రవీందర్, వివిధ సంఘాల ప్రతినిధులు సిద్ధిఖీ, మహేశ్వర్‌రాజ్, ప్రమీల, సంగీత, కృష్ణారావు, ఎల్లన్న పాల్గొన్నారు.



డాక్టర్ అంబేడ్కర్, వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్



వాకథాన్‌లో ప్రముఖ వైద్యులు, వ్యాపారవేత్తలు

ఆరోగ్యం బాగుంటేనే
వ్యాపారం మరింత ముందుకు..

- ఎఫ్‌టాప్సీ ఆధ్వర్యంలో వాకథాన్

ఖైరతాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర తెలంగాణతో హ్యాపీ తెలంగాణ అనే నినాదంతో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టాప్సీ) 107 సంవత్సరాల వేడుకల్లో భాగంగా వాకథాన్ నిర్వహించింది. పీవీ నర్సింహారావు మార్గం రోటరీ చౌరస్తా నుంచి సచివాలయం ముందు వరకు జరిగిన ఈ వాకథాన్‌లో ప్రముఖ వైద్యులతోపాటు వాణిజ్యవేత్తలు పాల్గొన్నారు. పద్మశ్రీ డాక్టర్ గోఖలే ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ వ్యాపారంలో రాణించాలంటే మొదట సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌టాప్సీ అధ్యక్షులు మీలా జయదేవ్, ఉపాధ్యక్షులు సురేష్ సింఘాల్, రవికుమార్, హెల్త్ కమిటీ చైర్మన్ శేఖర్‌అగర్వాల్, ఆస్కీ డీన్ సుబోధ్, మాజీ అధ్యక్షులు, సీఈవో సంగీత, కార్యదర్శి వీణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ద్వారకానాధ్, శ్రీకాంత్‌బాబు, డాక్టర్ బుఖారి, డాక్టర్ నరేష్, డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కచేరి

మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి సందర్భంగా...



బాలమురళీకృష్ణ రచనలను గానం చేస్తున్న సాత్విక మోహన్

పంజాగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ అనంద్‌నగర్ కాలనీ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాలులో పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలను గానం చేసిన విదిషి సాత్విక మోహన్, పోపూరి గౌరీనాథ్ గాత్ర కచేరీ ఆహుతులను ఆకట్టుకుంది. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ వ్యక్తిత్వం, సంగీత సాహిత్య విశేషాలపై విష్ణుభట్ల ముకుందశర్మ వివరించారు. విద్వాన్ బి.పవన్‌సింగ్ (వయొలిన్), విద్వాన్ కేసద్గురు చరణ్ (మృదంగం) విద్వాన్ బి.జనార్దన్ (ఘటం)తో సహకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన సంగీత ప్రియులు, స్థానికులు పాల్గొన్నారు.

మధురానగర్ కాలనీ అధ్యక్షుడిగా ప్రతాపరెడ్డి



వెంగళరావునగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వెంగళరావు డివిజన్, మధురానగర్ కాలనీ ఎన్నికలు స్థానిక సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగాయి. మొత్తం 1106 మంది శాశ్వత సభ్యులు ఉండగా, 585 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఫలితాలను ఎన్నికల అధికారి పి.మోహన్ కుమార్, చిలకల వెంకటేశ్వరరావు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం. ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎన్‌వీ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శిగా కోడె సాంబశివరావు, సంయుక్త కార్యదర్శిగా సి.హనుమంతరావు, కోశాధికారిగా కె.సుగుణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏ.సాంబశివరావు, ఐ.రాజేంద్రప్రసాద్, కోనేరు ఓంప్రకాష్, జి.నాగేశ్వరరావు, ఎం.ఉప్పలయ్య, కె.సత్యసాయికుమార్, పి.శ్రీనివాస్, జి.గోపాల్ రెడ్డి, పదహారు మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీవాసులు అభినందించారు.

ప్రైవేట్‌కు అప్పగించేందుకే నూతన విద్యా విధానం

పంజాగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్య, వైద్యాన్ని ప్రైవేట్ వారికి అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొస్తుందని వక్తలు ఆరోపించారు. బీసీలు తమ ఉద్యమ పంథా మార్చాలని, మిలిటెంట్ ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'బీసీ సమాజం అభివృద్ధి-తక్షణ కర్తవ్యం' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.కేశవులునేత అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, కుల సంఘాల నాయకులు, తదితరులు మాట్లాడారు. బీసీలు అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, తమ ఉద్యమ పంథాను మార్చాలని, సాంప్రదాయ ఉద్యమాలు మాని మిలిటెంట్ తరహా ఉద్యమం చేయాలని ఆర్.కృష్ణయ్య అన్నారు. చట్టసభల్లోనూ, బడ్జెట్లోనూ 50 శాతం వాటా వచ్చే వరకూ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. చిరంజీవులు మాట్లాడుతూ బీసీల్లో ఉన్న అనైక్యతే అన్నిటికీ మూలమని, ఐక్యంగా ఉన్నప్పుడే బీసీలు ఏదైనా సాధించగలరన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకపోతే అహింసా మార్గంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేద్దామని డాక్టర్ బి.కేశవులు అన్నారు. సమావేశంలో మేధావుల సంఘం కన్వీనర్లు డి.కిరణ్, శ్రీనివాస్ యాదవ్, బి.సురేందర్, గోపీ బోయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

బంగ్లాదేశ్ నుంచి నగరానికి తీసుకొచ్చి..
బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి..

- పెళ్లిచేసుకుని భార్యతో దందా..
- తప్పించుకొని పోలీసులను ఆశ్రయించిన యువతి

హైదరాబాద్ సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ యువతితో బలవంతంగా వ్యభిచారం చేస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బంగ్లాదేశ్ యువతిని రక్షించిన పోలీసులు ఆమెను హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. పూణెకు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులు బంగ్లాదేశ్‌లో ఉండి అక్కడి యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత సముద్ర మార్గం గుండా రహస్యంగా ఇండియాకు తీసుకొచ్చి పుణెలో కాపురం పెట్టాడు. ఆమె పేరుతో ఆధార్‌కార్డు సైతం సృష్టించాడు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల్లోనే అతనికి అప్పటికే పెళ్లయిన విషయం ఆ యువతికి తెలిసింది. దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఆమెను వదిలించుకోవాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడ కిస్మత్‌పూర్‌లో తన తమ్ముడు షాకీర్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. తర్వాత షాకీర్ ఆ యువతిని భయపెట్టి లొంగదీసుకుని, ఢిల్లీకి చెందిన జాకీర్‌కు అమ్మేశాడు. జాకీర్ పుణెకు చెందిన మరో మహిళతో హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ యువతిని కూడా కొద్దిరోజులు నిర్బంధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆన్‌లైన్‌లో విటులతో బేరం కుదుర్చుకొని ఆటోలో తీసుకెళ్లి కస్టమర్స్ వద్దకు, హోటళ్లకు తిప్పేవాడు. వచ్చిన డబ్బులు జాకీర్, పుణెకు చెందిన మహిళ తీసుకునేవారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ యువతికి, పుణె మహిళకు గొడవ జరిగింది. తెలుసుకున్న జాకీర్ యువతిని తీవ్రంగా కొట్టాడు. దాంతో ఆ యువతి వారి చెర నుంచి తప్పించుకొని స్థానికుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు జాకీర్, పుణె మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి వెనుక ఇంకా ఏదైనా ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక వేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్

పంజాగుట్ట, జూలై 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేశాయని సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్‌కుమార్ ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిరంతరం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిరంతరం ఉద్యమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నీట్ ప్రశ్నపత్రం లీక్ అయితే, కేంద్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా ఉండడం సిగ్గుచేటు అని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి రాజీనామా చేయాలన్న ఆయన, నేషనల్ టెస్ట్ ఏజెన్సీని రద్దుచేసి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యలో మతోన్మాద భావజాలన్ని జొప్పించి విద్య కాషాయీకరణకు పూనుకుంటుందని అన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థి సంఘం నాయకులు తాటికొండ రవి, వెంకట్, వీరబాబు, నాగేష్, నాగరాజు, చంద్రకాంత్, మణికాంత్, రేణుక, శేఖర్ తదితరులు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్‌లో చేరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఉదయ్‌కుమార్, కార్మిక సంఘం జాతీయ నాయకులు చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోతు రాజేష్‌నాయక్, సంద గణేష్, మధు, రంగస్వామి, సందీప్, సునీల్ చారి,హరీష్, తిరుపతి, శ్రీలత పాల్గొన్నారు.

రైలులో భార్యాభర్తలకు
మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి..

- 80 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్ చోరీ
- జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు

బర్కత్‌పుర జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన శీతల పానీయం(కూల్‌డ్రింక్) ఇచ్చి బంగారు అభరణాలను, నగదును దొంగలు చోరీ చేశారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా వేంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి(72) తన భార్యతో కలసి బెంగళూరులో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం మియాపూర్‌లో నివాసముంటున్న కూమార్తె వద్దకు రావడానికి మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కాచిగూడకు వస్తుండగా రైల్లో ఇద్దరు అపరిచిత వ్యక్తులు పరిచయమై, లోయర్ బెర్తులను ఇచ్చారు. హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో వెంకట్రాంరెడ్డి దంపతులు వారిని తినమని అరటి పండ్లు ఇచ్చారు. ప్రతిగా వారు మత్తు మందు కూల్‌డ్రింక్ ఇచ్చారు. తాగిన భార్యాభర్తలు మత్తులోకి జారుకున్నారు. ఆదివారం రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చిన తర్వాత వారికి మేలుకువ వచ్చింది. లేచి చూడగా పక్కనే ఉన్న బ్యాగు కనిపించలేదు. దానిలో 80 గ్రాముల బంగారు అభరణాలు, సెల్‌ఫోను, రూ.2వేల నగదు ఉన్నాయి. బాధితులు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్‌ఐఆర్ కింద కేసు నమోదు చేసుకొని, హిందూపురం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు

మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న
కాంట్రాక్టు టీచర్లను, సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



సమావేశంలో టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్టీ యూనియన్ ప్రతినిధులు

పంజాగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ టీచింగ్, నాన్‌టీచింగ్, సీఆర్టీ యూనియన్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ కార్యదర్శి ఎస్.షమీమ్, సంయుక్త కార్యదర్శి తన్వీర్, కోశాధికారి సల్మా ఖతూన్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అన్ని టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో 31 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నావని అన్నారు. తమకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి లభించే హక్కులు లేవని, నెలకు ఒక్క రోజు మాత్రమే సెలవు ఇస్తారని అన్నారు. 24 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.జమీల్, ప్రతినిధులు ఎండీ అబ్బు, హబీబా, అబ్దుల్లా, పాండు, జె.అరుణ, పర్వీన్ పాల్గొన్నారు.



లష్కర్ బోనాల ఉత్సవాల్లో భాగంగా తొలి బోనం సమర్పణ సందర్భంగా శ్యామల విన్యాసాలు



వాసవినగర్ కాలనీవాసులతో కలిసి డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జె.రామకృష్ణ

అభివృద్ధి అంటే ఫ్యాషన్ షోలు చేయడం కాదు

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ

సికింద్రాబాద్, మారేడుపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేయడం, వారి సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమంటే ఫ్యాషన్ షోలు చేయడం కాదని, నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఈమధ్య కొత్తగా పుట్టుకువచ్చిన కొందరు నాయకులు కాలనీల్లో తిరుగుతూ ఫ్యాషన్ షోలు చేస్తున్నారే తప్ప ఒక్క సమస్యకు కూడా పరిష్కారం చూపడంలేదన్నారు. కంటోన్మెంట్ 1వ వార్డులోని సంజీవయ్యనగర్ కాలనీ, 3వ వార్డులోని కార్ఖాన, 5వ వార్డులోని ఓల్డ్‌వాసవీనగర్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందించి, నిధులు కేటాయిస్తున్నదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి జరుగుతున్నదని, రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా కేటాయించడంలేదని ఆయన విమర్శించారు. రాబోయే రోజుల్లో కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి, కంటోన్మెంట్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వంశతిలక్, విజయానంద్, నర్సింగ్‌రావు, వాసవినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జె.నాగేశ్వరరావుతో పాటు కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఘటం పూజలో ఎమ్మెల్యే శ్రీగణేష్, గౌరీశంకర్, కాంగ్రెస్ నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీక

రెజిమెంటల్‌బజార్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఆషాఢ బోనాల ఉత్సవాలు ప్రతీక అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లాడి గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గండిమైసమ్మ ఘటం పూల అలంకరణ పూజకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో నూతనోత్తేజం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ రోజూ కొంత సమయం ఆధ్యాత్మికతకు కేటాయించాలన్నారు. బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబురావు, నందికంటి రవి తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌లో గెలుపొందిన మారేడుపల్లి అబాకస్ విజేతలు

అబాకస్ పోటీలో విజేతలుగా చిచ్చరపిడుగులు

అడ్డగుట్ట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని ఎస్ఐపీ అబాకస్ సంస్థ ప్రతినిధి అంబిక అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ మారేడుపల్లిలో తెలంగాణ వ్యాపితంగా 2వేల మందితో నిర్వహించిన అబాకస్ పోటీలో మారేడుపల్లికి చెందిన 42మంది పాల్గొనగా, 42 మంది విజేతలుగా నిలిచారన్నారు. ఇద్దరు చాంపియన్లు, 10 మంది ఫస్ట్ రన్అప్, 14 సెకెండ్ రన్అప్, 3వ రౌండ్‌లో 7గురు రన్అప్, 9 మంది పర్ఫార్మర్‌లుగా విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ తెలంగాణ వ్యాపితంగా అబాకస్ టోర్నమెంట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు మేధాశక్తి పెంచడానికి తమవంతు సాయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి అబాకస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీవాణి, మున్నిఅగర్వాల్, అర్చన పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జంపన తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

సికింద్రాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న నగరంలో పచ్చదనాన్ని పెంచడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ది హ్యూమన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బోయినపల్లి ప్లేగ్రౌండ్‌లో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. జంపనప్రతాప్, సంస్థ అధ్యక్షుడు ప్రకాష్ భాటియా, స్థానికులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ భావితరాలకు ఆక్సిజన్ లభించాలంటే ప్రస్తుత కాలంలో మొక్కలు విరివిగా నాటాలని పిలుపునిచ్చారు. ముప్పిడి మధుకర్, ప్రభుకుమార్, మోహన్‌కుమార్, సాయిబాబా, టింకు, జ్ఞానప్రకాష్, మునిరాజ్, ముఖేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతకు నిలయం

ఆర్ట్స్ కాలేజీ ఎంఎంటీఎస్ స్టేషన్

● స్టేషన్ ఆవరణలో దుర్గంధం
● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద అపరిశుభ్ర వాతావరణం

బౌద్ధనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, కాచిగూడ ప్రధాన రైల్వేస్టేషన్లకు మధ్యలో ఉన్న ఆర్ట్స్‌కాలేజీ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో అపరిశుభ్రత నెలకొంది. చెత్తచెదారంతో దర్శనం ఇస్తోంది. ప్రయాణికులు స్టేషన్ లోపలకు వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. స్టేషన్ లోపల వచ్చే దుర్వాసనతో చిన్నపిల్లలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. తార్నాక, ఉస్మానియా ఆర్ట్స్‌కాలేజీ, వారాసిగూడ, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాదిమంది ప్రయాణికులు, ఉద్యోగులు, స్టూడెంట్స్ ఆర్ట్స్‌కాలేజీ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఉందానగర్ - ఫలక్‌నామ - లింగంపల్లి ఎంఎంటీఎస్ ట్రైన్స్ ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వీటితోపాటు మెదక్, మహబూబ్‌నగర్ తదితర ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. అయితే గత కొన్నిరోజులుగా ఆర్ట్స్‌కాలేజీ రైల్వేస్టేషన్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవటంతో దుమ్ము, ధూళితో పాడుపడిన రైల్వేస్టేషన్‌లా తయారైంది. రైల్వేస్టేషన్ లోపల ఎందుకు శుభ్రం చేయటంలేదని బుకింగ్ కౌంటర్‌లో ఉన్న సిబ్బందిని అడిగితే పై అధికారులకు ఫిర్యాదు చేయండి అని దురుసుగా చెబుతున్నారని ప్రయాణీకులు వాపోయారు. ఇప్పటికైనా ఈ రైల్వేస్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ప్రయాణి కులు కోరుతున్నారు.

అధ్వానం

ఆర్ట్స్‌కాలేజీ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్లాస్టిక్ కవర్స్ మట్టితో అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల ఈ రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. టికెట్ రిజర్వేషన్ చేయించుకోవటానికి వచ్చేవారు, టికెట్ తీసుకోవటానికి వచ్చేవారు ఇబ్బందులుపడుతున్నారు.

ప్రయాణీకులు కూర్చోటానికి ఏర్పాటుచేసిన కుర్చీలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఒకటవ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై కుక్కలు, ఇతర జంతువులు వదిలిన మలినాలతో దుర్వాసన వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటవ, రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌లపై విపరీతంగా చెత్త పేరుకుపోయింది.

దీంతోపాటు ఆర్ట్స్‌కాలేజీ రైల్వేస్టేషన్ ముందు చెత్తాచెదారం కుప్పకుప్పలుగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించకుండా రైల్వేస్టేషన్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



ఆర్ట్స్‌కాలేజీ రైల్వేస్టేషన్ ముందు ఉన్న చెత్తాచెదారం

భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి

రైల్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీ

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు మత్తు మందు కలిపిన శీతల పానీయం ఇచ్చి బంగారు ఆభరణాలను నగదును దొంగలు తస్కరించారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా వేంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి(72) తన భార్యతో కలసి బెంగళూరులో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి శనివారం మియాపూర్‌లో నివాసముంటున్న కూతురి వద్దకు రావడానికి మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కాచిగూడకు వస్తుండగా రైల్లో ఇద్దరు అపరిచిత వ్యక్తులు పరిచయమై, లోయర్ బెర్తులను ఇచ్చారు. హిందూపురం రైల్వేస్టేషన్ సమీపంలో వెంకట్రాంరెడ్డి దంపతులు వారిని తినమని అరటి పండ్లు ఇచ్చారు. ప్రతిగా వారు మత్తు మందు కలిపిన శీతల పానీయాన్ని ఇచ్చారు. అది తాగిన భార్యాభర్తలు మత్తులోకి జారుకున్నారు. ఆదివారం రైలు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చిన తర్వాత వారికి మేలుకువ వచ్చింది. లేచిచూడగా పక్కనే ఉన్న బ్యాగు కనిపించలేదు. దానిలో 80 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోను, రూ.2వేల నగదు ఉన్నాయి. బాధితులు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకొని, హిందూపురం రైల్వేస్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

బస్సులో బంగారు ఆభరణాల చోరీ

ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్... ఎల్బీనగర్‌కు బదిలీ

కొత్తపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బస్సు ప్రయాణికురాలు ఓయూ పీఎస్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఓయూ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును శనివారం ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఎల్బీనగర్ సిరీస్ రోడ్డులో వాస్తుకాలనీలో ఉండే గృహిణి ఎస్.పద్మలత (45) గురువారం మల్లాపూర్ సూర్యనగర్ కాలనీకి వెళ్లి రెండున్నర తులాల బంగారు ఆభరణాలను రీమోడల్ చేయించుకుని ఆటోలో హబ్సిగూడకు వచ్చింది. అక్కడి నుంచి టీజీఆర్టీసీ 290 బస్సులో కామినేని చౌరస్తాకు చేరుకుని, బస్సు దిగి కొంతదూరం నడిచి, తర్వాత బ్యాగు చూసింది. ఆభరణాలు కనబడలేదు. శుక్రవారం ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బీఎన్ఎస్ ప్రకారం వారు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఎల్బీనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

రామగుండం రైల్వే స్టేషన్‌లో వెండి స్వాధీనం

● ఆపరేషన్ సటార్క్ విజయవంతం
● రైల్వే సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్‌లలో ఆపరేషన్ సటార్క్ ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఈ ఆపరేషన్ ద్వారా రామగుండం రైల్వేస్టేషన్‌లో 51.164కిలోల వెండి ఆభరణాలు ముగ్గురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మితి బెనర్జీ తెలిపారు. ఆదివారం ఈ ఆపరేషన్ ద్వారా ఆర్పీఎఫ్ బృందం రామగుండం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వెంటనే విచారించి తనిఖీలు చేయడం జరిగిందని, వీరి వద్ద నుంచి బ్యాగులో ఉన్న 51.164 కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు తెలుసుకున్నామన్నారు. ఈ ఆభరణాలు ఎక్కడి నుంచి వచ్చాయో ఆ ముగ్గురు వ్యక్తుల నుంచి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో ముగ్గురిపై కేసులు నమోదు చేసి ఈ ఆభరణాలను పెద్దపల్లి ఐటీ అధికారులకు అప్పగించామని, ఈ ఆభరణాలు విలువ రూ.47లక్షలు ఉంటుందన్నారు.



శ్రీజగన్నాథ రథయాత్ర ముందు భక్తుల భజనలు, కోలాటం

వైభవంగా శ్రీ జగన్నాథ ఉత్సవాలు

మారేడుపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర హిల్స్‌లోని శ్రీజగన్నాథ్ మందిర గోశాల 32వ చారియట్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వందలాది భక్తులు జగన్నాథ్ స్వామిని దర్శించుకున్నారు. భక్తి భజన గేయాలతో ఆలయ పరిసర ప్రాంగణాలు మారుమోగాయి. శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహేంద్రా హిల్స్‌లోని జగన్నాథ మందిరం నుంచి కంటోన్మెంట్ పార్క్, ధనలక్ష్మి కాలనీ, సత్యనారాయణ టెంపుల్ తదితర పరిసర ప్రాంతాల మీదుగా రథయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

దళిత చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై

లోతైన పరిశోధన జరగాలి

రవీంద్రభారతి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దళిత చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై మరింత పరిశోధనలు జరగాల్సిన అవసరముందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో దళిత చరిత్ర - సంస్కృతి - సాహిత్యం పునర్మూల్యాంకనం-ఖాళీల పూరింపు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన దళితోద్యమ వేగుచుక్క భాగ్యరెడ్డి వర్మ, ఇమానం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య లింబాద్రి, ఉస్మానియా వర్సిటీ తెలుగు శాఖ ఆచార్యులు చింతకింది కాశీం హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. దళిత ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ జీవితం ఈతరానికి ఆదర్శప్రాయమని వారన్నారు. మహనీయుల జీవిత్నా అక్షరీకరించి ఈతరానికి అందించడం అభినందనీయమని అన్నారు. చరిత్రను మరింత పరిశోధించి భవిష్యత్‌కు అందించాల్సిన బాధ్యత మేధావులపై ఉందని అన్నారు. ఈ సదస్సులో హైదరాబాద్ వర్సిటీ తెలుగు శాఖ ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. అనంతరం గుడిపల్లి నిరంజన్, సుబ్బాచారి పులికొండ, కోయి కోటేశ్వరరావు, రజిత కొమ్ము, ఎం.ఎ.మాలిక్, సైబాబా, సామిడి జగన్‌రెడ్డి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు.

బంగ్లాదేశ్ నుంచి నగరానికి తీసుకొచ్చి..

● బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి..
● పెళ్లిచేసుకుని భార్యతో దందా..
● తప్పించుకొని పోలీసులను ఆశ్రయించిన యువతి

హైదరాబాద్ సిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ యువతితో బలవంతంగా వ్యభిచారం చేస్తున్న ఇద్దరిని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి చెర నుంచి తప్పించుకున్న యువతి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బంగ్లాదేశ్ యువతిని రక్షించిన పోలీసులు ఆమెను హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. పూణెకు చెందిన ఓ వ్యక్తి కొద్దిరోజులు బంగ్లాదేశ్‌లో ఉండి అక్కడి యువతిని పెళ్లి చేసుకున్నాడు.

ఆ తర్వాత సముద్ర మార్గం గుండా రహస్యంగా ఇండియాకు తీసుకొచ్చి పుణెలో కాపురం పెట్టాడు. ఆమె పేరుతో ఆధార్‌కార్డు సైతం సృష్టించాడు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల్లోనే అతనికి అప్పటికే పెళ్లయిన విషయం ఆ యువతికి తెలిసింది.

దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఆమెను వదిలించుకోవాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడ కిస్మత్‌పూర్‌లో తన తమ్ముడు షాకీర్ వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. తర్వాత షాకీర్ ఆ యువతిని భయపెట్టి లొంగదీసుకుని, ఢిల్లీకి చెందిన జాకీర్‌కు అమ్మేశాడు. జాకీర్ పుణెకు చెందిన మరో మహిళతో హైదరాబాద్‌లోనే ఉంటూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ యువతిని కూడా కొద్దిరోజులు నిర్బంధించి వ్యభిచార వృత్తిలోకి దింపాడు. ఆన్‌లైన్‌లో విటులతో బేరం కుదుర్చుకొని ఆటోలో తీసుకెళ్లి కస్టమర్స్ వద్దకు, హోటళ్లకు తిప్పేవాడు. వచ్చిన డబ్బులు జాకీర్, పుణెకు చెందిన మహిళ తీసుకునేవారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ యువతికి, పుణె మహిళకు గొడవ జరిగింది. తెలుసుకున్న జాకీర్ యువతిని తీవ్రంగా కొట్టాడు. దాంతో ఆ యువతి వారి చెర నుంచి తప్పించుకొని స్థానికుల సహాయంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు జాకీర్, పుణె మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి వెనుక ఇంకా ఏదైనా ముఠా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు నటీ, నటులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● ప్రముఖ నటుడు పృథ్వీరాజ్

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు నటీ, నటులకు తెలంగాణ చలనచిత్ర పరిశ్రమ ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలని తెలంగాణ మూవీ, టీవీ, డీజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్ కోరారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మూవీ, టీవీ, డీజిటల్ ఆర్టిస్ట్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. యూనియన్‌ను నమ్ముకున్న కళాకారులకు తగిన పారితోషికం లభించేలా, పేద కళాకారులకు రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. యూనియన్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి బి.నూకరాజు, ఆల్ కమిటీస్ ఛైర్మన్ నందూరి రాము, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్, వర్కింగ్ మహిళా అధ్యక్షురాలు ఆశ, ఉపాధ్యక్షులు పద్మరేఖ, శ్రీనివాస్‌రాథోడ్, కోశాధికారి ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.పి.రెడ్డి, రజశ్రీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సినీనటుడు పృథ్వీరాజ్



నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు అన్యాయం

నేరేడ్‌మెట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నేరేడ్‌మెట్ పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆయన బీజేపీ నాయకులను కలిసి అరెస్టుకు గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమం ఉందని ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజా సమస్యలు కోసం బీజేపీ పోరాడుతుందని, అరెస్టులకు భయపడదన్నారు. అరెస్టైన బీజేపీ నాయకులను సాయంత్రం వదిలారు.

డ్రైనేజీ లీకేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

మల్కాజిగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి చౌరస్తాలో కొంతకాలంగా డ్రైనేజీ లీకేజీ సమస్యకు కార్పొరేటర్ శాశ్వత పరిష్కారం చూపారు. దీంతో పాత డ్రైనేజీని తీసి అందులో పెద్ద డయా గలిగిన డ్రైనేజీ పైపులు వేయించారు. సుమారు ఏడు లక్షల వ్యయంతో ఈ పనులు ప్రారంభించినట్లు కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మౌలాలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని మల్లికార్జున్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య ఆకాంక్షించారు. ఆదివారం గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రాంగణంలో కాలనీ సంక్షేమ సంఘం, షెనాయ్ ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్‌లు అర్జున్‌దీన్‌దయాళ్, అంకిత దీన్‌దయాళ్, వైద్యసిబ్బంది మచ్చేందర్‌యాదవ్, సాగర్, ప్రవీణ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు గోపాల్‌రెడ్డి, విజయ్, సత్యనారాయణ, రాజలింగం పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

అల్వాల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 24న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అల్వాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులను సెప్టెంబర్ 1న రవీంద్రభారతిలో సన్మానిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను భవిష్యత్ తరాల వారికి తెలియజేయటానికి తెలంగాణ రాష్ట్ర సాధకుల డాక్యుమెంటరీ ద్వారా ప్రతి ఉద్యమకారుడి చరిత్రను రికార్డ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రకమిటీ ప్రతినిధులు దయానంద్, జ్యోతిరెడ్డి, వీరాస్వామి, కొండస్వామి పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపులకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యం

నేరేడ్‌మెట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లోని మల్లన్న దేవాలయం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల కంటే పార్టీ ఫిరాయింపులకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించిన మల్కాజిగిరి ప్రజల రుణం తీర్చుకొంటానని అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ సత్యనారాయణబాబు, ధనలక్ష్మీ, ప్రసన్న, పర్వతాలు, ఇతర నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మౌలాలి డివిజన్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా

మౌలాలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మౌలాలి డివిజన్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ మారుతినగర్ కాలనీలో గల పార్టీ కార్యాలయంలో డివిజన్ ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతానన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కారించాలని ఎంపీకి వినతిపత్రాలను అందజేశారు. అనంతరం ఈస్ట్ దీన్‌దయాళ్‌నగర్ కాలనీవాసులతో సమావేశమై నాలాను పరిశీలించారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న ఆచార్యులు

ఘనంగా శ్రీవారి కళ్యాణం

మల్కాజిగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రతినెల రెండో ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏటీ రవీందర్‌రెడ్డితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.